www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 15 జూన్ 2023



నీట్‌లో భీమవరం తిరుమల విద్యార్థికి 18వ ర్యాంకు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం తిరుమల విద్యాసంస్థ విద్యార్థి తోటే జ్యోస్విక్ కృపాకుమార్‌కు నీట్‌లో ఆలిండియాలో 18వ ర్యాంకు రావడం భీమవరానికే కాకుండా ఉభయగోదావరి జిల్లాలకే గర్వకారణమని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం విడుదలైన నీట్ 2023 ఫలితాల్లో కృపాకుమార్ జాతీయస్థాయి ర్యాంకు ఆలిండియా స్థాయిలో 18వ ర్యాంకు సాధించడంపై స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆ విద్యార్థిని, తల్లిదండ్రులను, తిరుమల విద్యాసంస్థల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. గ్రంధి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ కృపాకుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఫల్మనాలజిస్ట్ లక్ష్యంగా చేసుకోవడం అభినందనీయమని, భవిష్యత్తులో కృపాకుమార్ ఈ ప్రాంతవాసులకు వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యా సంస్థ డైరెక్టర్లు శ్రీనివాసవర్మ, సాయిరాజు, విద్యార్థి తల్లిదండ్రులు జ్యోతి, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి..!



- మాఫియా తరహాలో బియ్యం వ్యాపారం
- రేషన్ వాహనాల్లోనే కొనుగోలు ప్రక్రియ
- బియ్యం ఇచ్చేది వారే.. కొనేది వారే అన్నట్లు పరిస్థితి
- కిలో రూ.పదికి కొనుగోలు చేసి అదనంగా అమ్మకాలు
- అధికారుల దాడుల్లో పట్టుబడేది నామమాత్రమే
- బియ్యం నాణ్యత లేకపోవడమే విక్రయాలకు ప్రధాన కారణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం రెండు జిల్లాల్లో మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లు సాగుతోంది. పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ దాడుల్లో పట్టుబడుతున్న రేషన్ అక్రమ బియ్యం నామమాత్రమే. మాఫియా తరహాలో రేషన్ బియ్యం దందా సాగుతుందని చెప్పొచ్చు. దీని వెనుక బడాబాబులు సైతం ఉండటంతో అధికార యంత్రాంగం సైతం పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. రేషన్ బియ్యం కొనుగోలు, విక్రయాలన్నీ రేషన్ పంపిణీ చేసే వాహనాల ద్వారానే జరుగుతుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రెండు జిల్లాల్లో దాదాపు 11.73 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 6.39 లక్షల వరకూ ఉండగా, పశ్చిమలో 5.33 లక్షల కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డులో ఉన్న ప్రతి వ్యక్తికీ ఐదు కిలోల చొప్పున బియ్యం ప్రభుత్వం అందిస్తోంది. రెండు జిల్లాల్లో 751 వరకూ వాహనాలు రేషన్ సరుకులను అందిస్తున్నాయి. ప్రతినెలా రెండు జిల్లాల్లోనూ మొత్తంగా 16,900 టన్నుల బియ్యం రేషన్ వాహనాల ద్వారా లబ్ధిదారులకు అందుతోంది. తాము అధికారంలోకి వస్తే రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇస్తామంటూ వైసిపి హామీ ఇచ్చింది. అయితే అమలు మాత్రం లేకుండా పోయింది. రేషన్ వాహనాల ద్వారా ఇస్తున్న బియ్యం నాణ్యత లేకపోవడంతో చిమిడిపోయి ముద్దవుతున్న పరిస్థితి ఉంది. దీంతో రేషన్ బియ్యం అన్నం తింటే కడుపునొప్పి వంటి సమస్యలు వస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. దీంతో రేషన్ బియ్యం విక్రయించి ఆ సొమ్ముకు మరికొంత సొమ్ము అదనంగా వేసి నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేసుకుని తింటున్న పరిస్థితి ఉంది.

యథేచ్ఛగా రేషన్ బియ్యం దందా..

జిల్లాలో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు వ్యాపారమంతా రేషన్ వాహనాల ద్వారానే సాగుతున్న పరిస్థితి నెలకొంది. లబ్ధిదారుల్లో ఎవరైనా బియ్యం వద్దనుకుంటే రేషన్ వాహనాల వద్దే కొనుగోలు సాగిపోతోంది. బియ్యం ఇచ్చినట్టు వేలిముద్ర వేయించుకుని వెంటనే కిలోకు రూ.పది చొప్పున సొమ్ము ఇచ్చేస్తున్నారు. వాలంటీర్ల నుంచి అందరికీ తెలిసే బియ్యం కొనుగోలు వ్యవహారం సాగుతోంది. ప్రతిరోజూ ఎంత బియ్యం ఇచ్చారు.. ఇంకా ఎంత బియ్యం వాహనాల్లో నిల్వ ఉందో తనిఖీలు చేస్తే బయటపడే అవకాశం ఉంటుంది. అయితే అది ఎక్కడా జరగడం లేదు. దీంతో బియ్యం కొనుగోలు అంతా బహిరంగంగానే సాగిపోతుంది. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు చేస్తున్న దాడులు నామమాత్రమేనని చెప్పొచ్చు. లబ్ధిదారుల నుంచి కిలో రూ.పది, రూ.12కు రేషన్ బియ్యం కొనుగోలు చేసి, కిలో రూ.18 నుంచి రూ.20కు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్న పరిస్థితి నెలకొంది. రేషన్ బియ్యం మాఫియా వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకుంటే తప్ప దీనికి అడ్డుకట్ట పడదు. రేషన్ బియ్యం కొనుగోలులో రేషన్ పంపిణీ వాహనాల పాత్ర ఉండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

నాణ్యత లేకపోవడమే పక్కదారికి ప్రధాన కారణం

ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందించే బియ్యం నాణ్యత లేకపోవడంతో తినేందుకు అనుకూలంగా ఉండటం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. కొంతమంది వేరే గత్యంతరం లేక రేషన్ బియ్యంతోనే కడుపు నింపుకుంటుండగా అనారోగ్య సమస్యలతో బాధపడే కొంతమంది లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. చాలా మంది వృద్ధులు బిపి, సుగర్ వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వారంతా రేషన్ బియ్యం తింటే ఇబ్బందికరంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం నాణ్యమైన బియ్యం ఇస్తే ఎందుకు అమ్ముకుంటామని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. రేషన్ బియ్యం లబ్ధిదారులు తినడం లేదంటూ ప్రచారం చేసి నగదు బదిలీ వంటి ఆలోచనలను తెరపైకి తెస్తున్న పరిస్థితి సృష్టిస్తున్నారు. ప్రభుత్వం నాణ్యమైన సన్న బియ్యం అందించి రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. అంతేకాకుండా రేషన్ బియ్యం దందాకు పాల్పడుతున్న సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

లంక భూములు సాధించే వరకు పోరు ఆగదు

ఎంఎల్ఎ నిమ్మల, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

కొనసాగిన నిరసన దీక్షలు

ప్రజాశక్తి - యలమంచిలి

పెరుగులంక భూములను సాధించే వరకు తమ పోరాటం ఆగదని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లంక భూముల్లో మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా నిరసన దీక్షలు బుధవారం కూడా సాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు ఉక్కు పాదంతో ఉద్యమాలను అణచివేయలేరన్నారు. ఈ వైసిపి ప్రభుత్వం, వారికి వంత పాడుతున్న అధికారులు ఎన్ని కుతంత్రాలు చేసినా ఆఖరికి ఉద్యమం విజయం సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. అనంతరం మంగళవారం పోలీసుల దాడిలో గాయ పడిన బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కౌరు పెద్దిరాజు, నేతలు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండలు, ఆంజనేయులు, సత్యనారాయణ, రాజు, రాజేష్ పాల్గొన్నారు.

ప్రజాసేవలో జవాబుదారీతనం ముఖ్యం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సేవలో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీ తనం ఉండటం ముఖ్యమని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, గడపగడపకూ మన ప్రభుత్వం, ఉపాధి హామీ, వ్యవసాయానికి సాగునీరు విడుదల, హౌసింగ్ అంశాలపై బుధవారం ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష జూన్ 23న శ్రీకారం చుట్టనున్నట్లు ముఖ్యమంత్రి తెలియజేశారన్నారు. దీనికి ఒక తేదీని ముందుగా నిర్ణయించి మండల, సచివాలయ పరిధిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జగనన్న సురక్ష ఉద్దేశ్యం పరిష్కారం చేయాలని తెలిపారు. జులై 23వ తేదీలోగా ఈ మేరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇంటి నిర్మాణాలు పూర్తయిన చోట తాగునీరు, విద్యుత్, సోక్‌పిట్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జులై 7వ తేదీన హౌసింగ్ కార్యక్రమం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తెలిపారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి ఆర్‌బికేల ద్వారా సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. జులై మొదటి రోజు నాటికి నాట్లకు సిద్ధమవ్వాలని తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించను : కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ ఉద్యోగులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ శానిటేషన్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడంతోపాటు వీధులన్నీ శుభ్రంగా ఉండేలా పారిశుధ్య సిబ్బంది పని చేయాలన్నారు. శానిటరీ సెక్రటరీలు కూడా మస్తరు పాయింట్లలో సకాలంలో హాజరు వేయాలన్నారు. డ్రెయిన్లలో పూడికతీత రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రతిరోజూ ఉదయాన్నే పట్టణంలో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. పనులు నాణ్యతతో చేయించడంతోపాటు, కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు మున్సిపల్ జనరల్ నిధులతో చేసే పనులకు సిఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా చెల్లింపులు చేయడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చినందున దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డస్ట్‌బిన్ల పంపిణీలో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సొమ్ము కట్టకుండా ప్లాన్లు ఇవ్వడం లేదని తన దృష్టికి వచ్చిందని, దీనిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఐదున్నర కోట్లతో రెండో ఫిల్టర్ ప్లాంట్ పనులు జరుగుతున్నాయని, సెకండ్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పూర్తయ్యాక 24 గంటలు నీటి సరఫరా చేసే విధానాన్ని ప్రవేశపెడతామని మంత్రి కొట్టు వెల్లడించారు. పెండింగులో ఉన్న టిడ్కో గృహాలకు బ్యాంకు లింకేజీ సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాలన్నారు. ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని కొట్టు హెచ్చరించారు. మున్సిపల్ ప్రత్యేకాధికారి, ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ మంత్రి సలహా సూచనలు పరిగణనలోకి తీసుకుని పట్టణ ప్రజలకు సమర్థవంతమైన సేవలందించేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను అనుసంధానం చేసుకుని మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్ మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ కె.ధర్మరాజు, టిపిఒ మధు, టౌన్ సర్వేయర్ రౌతు రామకృష్ణ, హౌసింగ్ డిఇ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జి.మల్లికార్జునరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విఎస్‌విఎల్.జగన్నాధరావు, మండల విస్తరణాధికారి టి.మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శులు జివిఎన్ఎల్.నరసింహారావు, జివివి.సత్యనారాయణ, డి.నాని, దుర్గాప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

దళితులు కుర్చీల్లో కూర్చోవడం నేరమా

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోకపోతే జిల్లావ్యాప్త ఉద్యమం

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణపై తక్షణం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టప్రకారం కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. బుధవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ ఆఫీస్ వద్ద కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ భీమవరం మున్సిపల్ కమిషనర్ తన ఆధిపత్య కులదురహంకారంతో వ్యవహరించడం దారుణమన్నారు. దళిత చర్మకారులు కాన్ఫరెన్స్ హాలులో కుర్చీల్లో కూర్చుండటం సహించని కమిషనర్ వాళ్లని బలవంతంగా బయటికి గెంటేయడం కుల వివక్షే అని అన్నారు. దీనిపై ఇప్పటివరకు జిల్లా అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సమావేశం ఏర్పాటు చేయడంతో వారంతా వచ్చారని, ఇడి సైతం లెక్క చేయకుండా మెప్మా సంస్థ ప్రతినిధికి ఫోన్ చేసి వాళ్లని కుర్చీల్లో కూర్చోబెడతారేంటి బయటికి పొమ్మనండి అనడం అగ్ర కుల దురహంకారమేనన్నారు. ఇదేమిటని ప్రశ్నించినా ఇడిని సైతం మహిళ అని కూడా చూడకుండా బయటికి పొమ్మని అవమానించారన్నారు. తక్షణం మున్సిపల్ కమిషనర్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్ట ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొల్లి బాలస్వామి, జామి ప్రసాద్, సన్యాసిరావు, కంకిపాటి సూరిబాబు, కళింగి సోమయ్య, ఎం.చినబాబు, డి.ఆదాం, కె.లక్ష్మయ్య, కె.నాగేశ్వరరావు, బిసి.వెంకన్న, మోర్ల బాలఏసు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పిఎం.లంక డిజిటల్ భవన్‌లో ఎంఐసి (మేక్ ఇండియా కెపబుల్) శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జాబ్‌లో చేరేందుకు నైపుణ్యం అవసరమన్నారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ చేయగల నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ముఖ్యమని తెలిపారు. వేగంగా అభివద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్ డిమాండ్‌లను తీర్చడానికి అవసరమైన నైపుణ్యాలు, విజ్ఞానంతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఎంఐసి శిక్షణా కార్యక్రమం దోహదపడుతుందన్నారు. డెలాయిట్ మద్దతుతో ఈ శిక్షణా కార్యక్రమం, విద్యార్థులకు వారి ఉపాధిని మెరుగుపర్చడానికి సమగ్ర శిక్షణను అందించడం లక్ష్యంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, హెడ్ హెల్డ్ హై డైరెక్టర్ శ్రీకుమార్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో కొత్త కోర్సులు, అదనపు సీట్లు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో అదనపు కోర్సులకు, ప్రస్తుతం ఉన్న కొన్ని బ్రాంచీల్లో అదనపు సీట్లకూ ఎఐసిటిఇ అనుమతి మంజూరు చేసిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె.నిషాంత్‌వర్మ, ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు చెప్పారు. బుధవారం వారు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాజాగా తమ కళాశాలకు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్స్ (సిఎస్ అండ్ ఐటి) కోర్సుకు అనుమతి లభించిందన్నారు. ఇప్పటికే తమ కళాశాలలో ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు సంబంధించి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ బేస్డ్ కోర్సులు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ అండ్ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ ఇంక్లూడింగ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వీటితో పాటు కోర్‌గ్రూప్‌లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ గ్రూపులతో మొత్తం 12 బ్రాంచీల్లో 1860 మంది విద్యార్థులను మొదటి సంవత్సరంలో చేర్చుకునే అవకాశం తమ కళాశాలలో ఉందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు దీనిని దృష్టిలో పెట్టుకుని మంచి కోర్సులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. గతేడాది తమ కళాశాలకు చెందిన విద్యార్థులు 1500 మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఉద్యోగాలు పొందారని ఆయన వివరించారు. రాష్ట్రంలో అత్యధిక ప్లేస్‌మెంట్స్ తమ విద్యార్థులు అందుకున్నారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల ధర్నా

నరసాపురం టౌన్: మే నెల జీతం, డిఎ రికవరీ చెల్లించాలని కోరుతూ నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన 60 మంది విఆర్ఎలు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు బుంగ గణేష్‌రావు, నరసాపురం డివిజన్ అధ్యక్షులు ముటూరు మోషే విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆపిన మే నెల జీతం వెంటనే ఇవ్వాలని, దీర్ఘకాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టరేట్ వద్ద 20 మండలాల విఆర్ఎలతో మహాధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు శ్రీరావూరి మాణిక్యాలరావు, మండల కోశాధికారి కొత్తపల్లి సుబ్బారావు, ఉపాధ్యక్షులు రాపాక ప్రసాద్, సిఐటియు నాయకులు తెలగంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.


సత్తా చాటిన ప్రగతి విద్యార్థులు

ప్రజాశక్తి - తణుకురూరల్

ఇఎపిసెట్ ఫలితాల్లో మరోసారి తమ కళాశాల ఆధిక్యత కనబరిచిందని ప్రగతి జూనియర్ కాలేజీ డైరెక్టర్ ఎంఎస్ఆర్.ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పిఎన్‌డి మహిత అత్యుత్తమ ర్యాంక్ 655 సాధించగా, ఎస్‌కె మజాన్‌బీ 1722, టి.జయవెంకటలావణ్య 3202, వి.హర్షిత 3794 సాధించారని తెలిపారు. 10 వేలలోపు ర్యాంకులు 14 మంది, 20 వేలలోపు 25 మంది సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.



ర్యాంకులు సాధించిన ప్రగతి విద్యార్థినులు



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తాచాటిన శ్రీ సూర్య

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఎపి ఇఎపిసెట్‌లో శ్రీ సూర్య కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. లిఖితపూడికి చెందిన విద్యార్థిని వంద్రసి సత్యరేణుక ఇంజినీరింగ్ విభాగంలో 4744 ర్యాంకు సాధించగా, మరో 15 మంది విద్యార్థులు 12 వేలలోపు ర్యాంకులు సాధించారు. సత్యరేణుక ఇంటర్మీడియట్‌లోనూ 986 మార్కులు సాధించి అత్యున్నత ప్రతిభకనబర్చారు. అగ్రికల్చర్ విభాగంలో అధికారి చరిష్మా 3749 ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఘంటశాల సూర్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, కె.జానకీరామ్, కె.త్రిమూర్తులు, ఎం.ఫాజిల్, కె.లక్ష్మీనారాయణ, ఎస్.వేణుగోపాల్, సిహెచ్.కరుణ్‌కుమార్, ఎం.చరణ్, ఎం.శ్రీనివాస్, ఎం.ముత్యాలరావు, జె.సుబ్బారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.పుల్లారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

సత్తా చాటిన పెన్నాడ విద్యార్థి

ప్రజాశక్తి - పాలకోడేరు

పెన్నాడ గ్రామానికి చెందిన లంక రాకేష్ వెంకట సాయి ఎపి ఎంసెట్‌లో సత్తా చాటారు. 286వ ర్యాంకు సాధించి అత్యున్నత స్థాయిలో నిలిచాడు. రాకేష్ వెంకట సాయి తండ్రి కృష్ణ పోస్టల్ శాఖలో పనిచేస్తూ కరోనాతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో తల్లి ధనలక్ష్మి భర్త కృష్ణ మృతి చెందగా వస్తున్న పింఛను సహాయంతో రాకేష్ వెంకట్ సాయిని చదివిస్తున్నారు. ఐఐటి పూర్తి చేసి సివిల్ సర్వీసెస్ ద్వారా కలెక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని రాకేష్ వెంకట సాయి తెలిపారు.



రాకేష్ వెంకట సాయి

నార్నిమెరక సర్పంచి భర్త మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని నార్నిమెరక గ్రామ సర్పంచి వలవల లక్ష్మీ భర్త వలవల సత్యనారాయణ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ నార్నిమెరక వెళ్లి సత్యనారాయణ భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలని వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఎంపిటిసి శ్రీధర్‌వర్మ, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు వల్లభు నరసింహారావు, కాజా తూర్పు సర్పంచి పాలంకి శ్రీను, గుర్రాల వెంకట్రావు, ధర్మారావు, గంగాధర్, వీరా ఉమ పాల్గొన్నారు.

లక్ష్మమ్మ కుటుంబానికి సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి

ఇటీవల వృద్ధాప్యం తో మృతి చెందిన మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన ఉద్యమ నాయకురాలు విప్పర్తి లక్ష్మమ్మ కుటుంబాన్ని బుధవారం సిపిఎం నేతలు బి.బలరాం, చింతకాయల బాబూరావు, కౌరు పెద్దిరాజు, జక్కంశెట్టి సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ 1977 - 82 మధ్య కాలంలో గ్రామంలోని పేదల తరపున వీరోచితంగా పోరాడిన మహిళల్లో లక్ష్మమ్మ కూడా ప్రముఖంగా నిలిచారన్నారు. ఉద్యమంలో చైతన్యంతో పాల్గొన్న తన భర్త పెద వెంకన్నను కూడా ఎంతగానో ప్రోత్సహించే వారిని, అటువంటి ఉద్యమ నాయకురాలని కోల్పోవడం పార్టీకి తీరని లోటని అన్నారు. వారి వెంట నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, చెల్లుబోయిన వడ్డీ కాసులు, మూరాల రాజేష్, నాని ఉన్నారు.

ఎస్‌కెఎస్‌డి విద్యార్థినులకు అత్యుత్తమ ర్యాంకులు

తణుకురూరల్: ఇఎపిసిఇటి ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలిపారు. తమ విద్యార్థిని కె.నీరజాసాయి 8675వ ర్యాంకు, ఎం.సెలీనాగ్రేస్ 13470వ ర్యాంకు, పలువురు విద్యార్థినులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇఎపిసిఇటి కోచింగ్‌ను ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే అతి సాధారణ విద్యార్థినులతో అతి తక్కువ సమయంలోనే ఈ ఘనత సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ర్యాంకులను సాధించిన విద్యార్థినులను కళాశాల కరెస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, ట్రెజరర్ నందిగం సుధాకర్ తదితరులు అభినందించారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ధర్నా

పాలకొల్లు: తమ గ్రామంలో అసలు విద్యుత్ ఉండటం లేదని, కరెంటున్నా బల్బులు సైతం వెలగని పరిస్థితి ఉందంటూ చింతపర్రు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మూడు నెలలుగా లోఓల్టేజీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని బుధవారం సాయంత్రం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వెంటనే సమస్య పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. గ్రామంలో లోఓల్టేజీ సమస్యతో విద్యార్థులు కనీసం చదువుకోవడానికి కరెంటు ఉండటం లేదని, ఇంట్లో ఫ్యాన్లు, మిక్సీలు, టీవీ వంటివేమీ పని చేయడం లేదని, చివరకు ఇన్వర్టర్లు కూడా కాలిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఎఇ పట్టించుకోకపోవడంతో ఈ ధర్నా చేపట్టామన్నారు. పలువురు మహిళా వార్డు సభ్యులు, చిన్నారులు సైతం ఈ ధర్నాలో పాల్గొన్నారు. ధర్నాకు సత్యనారాయణ నాయకత్వం వహించారు.

జగన్ పాలనకు స్వస్తి పలకాలి : టిడిపి

ప్రజాశక్తి - కాళ్ల

బిసిలంతా ఐక్యమై సిఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో సాగిస్తున్న దుర్మార్గపు పాలనకు స్వస్తి పలకాలని టిడిపి బిసి సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్ తెలిపారు. లక్ష్మీ నరసింహపురం గ్రామంలో బిసి పోరుబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపురం పార్లమెంట్ సగర సాధికార కన్వీనర్ కాలవ వెంకట్రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీర శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నుంచి బిసిలపై అనేక దాడులు జరుగుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బిసిలు ఐక్యమై జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సగర సాధికార మీడియా కోఆర్డినేటర్ గజ్జల గణేష్, నియోజవర్గం బీసీ సెల్ అధ్యక్షులు దొంగ కష్ణ, సగర సాధికారిక జిల్లా సభ్యులు తాటిపర్తి నరసింహస్వామి, ద్రోణాద్రి స్వామి పాల్గొన్నారు.

వారాహి యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టనున్న వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన ఎంపిటిసి సభ్యురాలు దాసిరెడ్డి పుణ్యవతి పిలుపునిచ్చారు. యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ఆచంట కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారాహి యాత్రను విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, నంబూరు విజయ్, శ్రీనివాసరావు, నాని, రాజు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గూట్లపాడు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం రూ.21 లక్షలతో నిర్మించనున్న వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసినట్లు తెలిపారు. గడిచిన నాలుగేళ్ల పాలనలో 98 శాతానికి పైగా హామీలను అమలు చేసి నవరత్న పథకాల రూపంలో అర్హులైన ప్రతి కుటుంబానికీ రూ.లక్ష నుండి రూ.5 లక్షల వరకూ లబ్ధి జరిగే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. భీమవరం నియోజకవర్గంలో గడిచిన నాలుగేళ్లలో సుమారుగా రూ.1200 కోట్ల మేర ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి జరిగిందన్నారు. భీమవరం నియోజకవర్గంలో దాదాపుగా 15 వేల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, పట్టాలు కూడా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.రవికుమార్, పంచాయతీరాజ్ డిఇ స్వామి నాయుడు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు పాల్గొన్నారు.

నేడు జగనన్న విద్యాకానుక అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 15 తేదీ పెనుమంట్ర హైస్కూల్లో నియోజకవర్గ స్థాయిలో జగనన్న విద్యా కానుక అమలు చేస్తున్నట్లు ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనుమంట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటర్లో నలుగురు టాపర్లకు, పదిలో టాపర్లకు రూ.15 వేల నగదు బహుమతిని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు చేతుల మీదుగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

ప్రార్థనా మందిరానికి పివిఎల్ శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో నూతనంగా నిర్మించబోయే పెనుయేలు ప్రార్థనా మందిరం నిర్మాణానికి డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మీయ తల్లి దాయం సునీత, పాస్టర్ ఈదా విజయప్రసాద్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన ప్రార్థనా మందిరం త్వరితగతిన అత్యాధునిక హంగులతో పూర్తి చేసి ప్రార్థనలను మొదలు పెట్టేలా చూడాలని వారు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాల రాజు అన్నారు. బుధవారం స్థానిక హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా ఎక్కువగా నీరు తాగాలన్నారు. అలాగే ఒరస్ ద్రావణం తీసుకుంటే వడదెబ్బను నివారించవచ్చని తెలిపారు. ఎండలో తిరగొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఎఎస్ఎస్‌బిఆర్.ప్రసాద్, అంజలి దేవి, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాతూరి వ్యాఖ్యలపై వైసిపి నేతల ఆగ్రహం

ప్రజాశక్తి - ఉండి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు వ్యాఖ్యలపై మండలానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు గుండాబత్తుల సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి గలావిల్లి ధనుంజయ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన టిడిపి వెంకటేశ్వరరాజు ఎన్ఆర్‌పి అగ్రహారంలో లబ్ధిదారులకు గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో వైసిపి నాయకులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని వ్యాఖ్యానించడమే కాకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని దుర్భాషలాడడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు గ్రామంలోనే ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, వైసిపి నాయకులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని ఈ విషయాన్ని పొత్తూరి వెంకటేశ్వరరాజు తెలుసుకోవాలని వారు హితవు పలికారు. ఇప్పటికైనా పొత్తూరి వెంకటేశ్వరరాజు భేషారతుగా తమకు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అంగర రాంబాబు, రాయి సతీష్, అందుకూరి రాజు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా జన్ భాగీదారి

వీరవాసరం: మండల వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో జన్ భాగీదారి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొనే ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేసే కార్యక్రమాలతో పాటు కుటుంబస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారికి అవగాహన కలిగించారు. ప్రాథమిక స్థాయిలో బాల్యదశలో కలిగించే ప్రేరణతో మనిషి వ్యక్తిత్వ వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు అందించే తోడ్పాటును ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో నాగరత్నం పాల్గొన్నారు.

పశువైద్య శాఖ ఎడిగా మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రభుత్వ పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ జి.మల్లేశ్వరరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఉండి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ రాజశేఖర్ కృష్ణా జిల్లా ఉయ్యూరుకు బదిలీ అయ్యారు. పాలకొల్లు పశువైద్య కార్యాలయంలో వెటర్నరీ సిబ్బంది, ఇరువురు అధికారులకు స్వాగతం, వీడ్కోలు పలికారు. 5 సంవత్సరాలుగా డాక్టర్ రాజశేఖర్ చేసిన సేవలను కొనియాడారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

పాలకొల్లు రూరల్: లోఓల్టేజీ, కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని చింతపర్రు గ్రామస్తులు బుధవారం శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి విద్యుత్ శాఖ అధికారులకు అనేకసార్లు విన్నవించినప్పటికీ సరైన స్పందన లేదని తెలిపారు. వెంటనే స్పందించిన ఎంఎల్ఎ స్థానిక రూరల్ ఎఇతో మాట్లాడి వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సరిపడా లోడ్ పెంచి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వి.సత్తిబాబు, తొంటే సుబ్బారావు, వేమన సత్యనారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చట్రంలో.. ఆకివీడు..!

ప్రజాశక్తి - ఆకివీడు

ట్రాఫిక్ సమస్య ఆకివీడును పట్టి పీడిస్తోంది. దశాబ్దాల తరబడి రోజురోజుకూ ఆకివీడులో సమస్య పెరుగుతున్నా ఎవరూ పట్టించుకోని పరిస్థితి నెలకొంది. 1995కు ముందు తాలూకా కేంద్రంగా తరువాత మండల కేంద్రంగా మారింది. అనంతరం దశాబ్దాల తరబడి జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో అతిపెద్ద పంచాయతీగా సాగింది. సుమారు మూడేళ్ల క్రితం నగర పంచాయతీ (గ్రేడ్-5 మున్సిపాల్టీ)గా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ స్థాయిని పెంచింది. మండల కేంద్రంగా ఉన్న ఈ పట్టణ పరిసరాల్లోని సుమారు 40 గ్రామాలకు కూడలిగా ఉంది. అంతేకాకుండా మండలం మొత్తం ఆక్వా హబ్‌గా అభివృద్ధి చెందింది. అంతకుముందు రాష్ట్రంలోనే అతిపెద్ద రైస్ మిల్లుల కేంద్రంగా ఉండేది. ప్రస్తుతం రైస్ మిల్లుల సంఖ్య తగ్గినప్పటికీ ఆ స్థానంలో ఐసు ఉత్పత్తి కేంద్రాలు, కొనుగోలు కేంద్రాలు, ఎరువులు, మందులు ఆక్వా ఆహార ఉత్పత్తుల కేంద్రాలు పెరిగాయి. ఈ మేరకు రవాణా స్థాయి విపరీతంగా పెరిగింది. రోజూ ధాన్యం, చేపల మేతల లారీలలోడ్లు వందల సంఖ్యలో తిరుగుతుంటాయి. మండలంలోని ఇతర గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు రాకపోకలకు అనునిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఇవే కాకుండా ఆర్‌టిసి బస్సులు, జిల్లా కేంద్రం భీమవరానికి వచ్చిపోయే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒక అయి భీమవరం మలుపు నుండి మాదివాడ సెంటర్ వరకూ ఉన్న జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు కనీసం

ప్రజల అవస్థలు

గంటన్నర పైన పడుతుందంటే ట్రాఫిక్ పరీక్ష అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ ట్రాఫిక్ ఆంక్షలు ఎవరూ పట్టించుకోరు. అసలు ఆ ఆంక్షలు అమలు చేసే వారే లేరు.

ఇక్కడ ట్రాఫిక్ పోలీసులుండరు. సాధారణ సివిల్ పోలీసులే వీలును బట్టి ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ ఉంటారు. ఒక ఆకివీడు పట్టణం మాత్రమే కాకుండా పల్లెలతో కలిపి సుమారు లక్ష మంది పైబడి ఇక్కడ జనాభా ఉన్నారు. జనాభా ప్రాతిపదికన కనీసం ఇక్కడ పాతికమంది పైబడి సిబ్బంది ఉండాలి. ఉన్న పది మందిలో ఒకరు ప్రతినిత్యం కోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది. ఒకరు రిసెప్షన్లో ఉండాలి. ఇద్దరూ రైటర్‌గా ఉంటారు. ఇక స్టేషన్ కాపలా ఒకరు ఉండాలి. మిగిలినవారికి వేర్వేరు పనులు చూస్తుంటారు. ఇక ట్రాఫిక్ ఆంక్షలు ఎక్కడ జరుగుతాయి. ఆకివీడు ఇటీవలే సర్కిల్‌గా ప్రకటించి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. స్టేషన్ మాత్రమే ఉంది. సిబ్బంది ఒక కంప్యూటర్ చేసేందుకు తప్ప మరెవరూ లేరు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆకివీడులో పోలీసుల సంఖ్య పెంచడంతోపాటు రెండో పోలీస్ స్టేషన్ కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది.


ఆకివీడులో నిత్యం జాతీయ రహదారిపై సాగుతున్న ట్రాఫిక్

ప్రమాదాలకు నిలువుగా..

ఉప్పుటేరు నుంచి ఆకివీడు శివారు ఎండిఒ కార్యాలయం దాటే వరకూ రోజూ ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. పట్టణానికి తూర్పున భీమవరం వెళ్లే మార్గంలో ఎండిఒ కార్యాలయం వద్ద ఉన్న కుప్పనపూడి మలుపు యాక్సిడెంట్ జోన్‌గా మారిపోయింది. అదే పరిస్థితి పట్టణానికి పడమట ఉప్పుటేరు వద్ద కైకలూరు వెళ్లే రోడ్డులో కూడా ప్రమాదాలకు నెలవుగా మారింది. ప్రాణ సంకటం ఉన్నప్పటికీ చిన్నచిన్న ప్రమాదాలు మాత్రం పదుల సంఖ్య దాటి ఇక్కడ ప్రతినిత్యం జరుగుతుంటాయి. ఇన్ని ప్రమాద పరిస్థితులకు నిలువుగా మారిన ఆకివీడు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం వెంటనే చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక విష్ణు క్యాంపస్‌లోని వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆనంద బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 75 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విష్ణు క్యాంపస్ డైరెక్టర్లు జె.ప్రసాద్ రాజు, డాక్టర్ డి.సూర్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్స్ కె.నటరాజు, డిఐఆర్ కృష్ణంరాజు రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం అంటే ప్రాణదానం అన్నారు.

పాలకొల్లు : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్, బ్లడ్ డోనర్స్ క్లబ్, ఆపద్బంధు వాలంటరీ బ్లడ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు, ఎబిఎస్.మూర్తి, అకాడమిక్ అడ్వయిజర్ ప్రారంభించారు. నరసింహారావు మాట్లాడారు. తాను ఇప్పటికి వందసార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి రక్తదానం చేసేందుకు ముందుకొస్తున్న వారిని అభినందించారు. కళాశాల ఎకడమిక్ అడ్వయిజర్ ఎబిఎస్.మూర్తి మాట్లాడారు. శిబిరంలో 45 మంది విద్యార్థులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.

మొగల్తూరు : రక్తదానంతో వేరొకరి ప్రాణాలు నిలబెట్టొచ్చని ఆరోగ్య వర్షిణి వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి, సామాజిక సేవా కార్యకర్త నాగిడి రాంబాబు అన్నారు. బుధవారం ముత్యాలపల్లి గ్రామం ఆరోగ్య వర్షిణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 68 సార్లు రక్తదానం చేసిన బొడ్డు కృష్ణ భగవాన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివాలయం మాజీ ఛైర్మన్ కొల్లాటి పెంటయ్య, కొప్పాడ వెంకట దుర్గా నాగరాజు, పట్టా పరమేశ్వరరావు, తిరుమాని శ్రీనుబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ప్రతి రక్తపు బొట్టూ ఆయువు పట్టు వంటిదని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని చెప్పారు. డీన్లు జిబి.వీరేష్ కుమార్, డాక్టర్ టి.కురుమయ్య మాట్లాడారు. విద్యార్థులు సకాలంలో స్పందించి రక్తదానం చేయడం ద్వారా ఎన్నో నిండు ప్రాణాలను కాపాడటంతోపాటు వారి కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ సుదర్శన్ దీప పాల్గొన్నారు.


ఎంపికైన రామకృష్ణంరాజు (ఎడమవైపు ఉన్న వ్యక్తి)

బీచ్ వాలీబాల్ జట్టుకు పాలకోడేరు వాసి

పాలకోడేరు : 2023 భారత బీచ్ వాలీబాల్ పురుషుల జట్టుకు పాలకోడేరు గ్రామానికి చెందిన ముదునూరి చలపతి రామకృష్ణంరాజు, అనంతపురానికి చెందిన టి.నరేష్ ఎంపికైనట్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకూ చైనాలో పింగ్టన్, ఫుజియాన్‌లో జరిగే ఐసినియర్ ఏషియన్ బీచ్ వాలీబాల్ ఛాపియన్ షిప్‌లో ఆడనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీరిరువురు హైదరాబాద్‌లోని కస్టమ్స్, సెంట్రల్ టాక్స్ జిఎస్‌టి డిపార్ట్మెంట్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్నారు.

19 నుంచి ఎఎస్ఎన్ఎంలో అడ్మిషన్లు ప్రారంభం

పాలకొల్లు: పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో 2023-24 సంవత్సరానికి గాను అడ్మిషన్ల కోసం ఈ నెల 19 నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి బుధవారం విలేకరులతో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం తీసుకొస్తున్నట్లు తెలిపారు. మొత్తం 9 సింగిల్ మేజర్ సబ్జెక్టు కోర్సులు ఉన్నట్లు వివరించారు. బికామ్, బికామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎ ఎకానమిక్స్, బిఎ పొలిటికల్ సైన్స్, బిఎస్‌సి మ్యాథ్స్, బిఎస్‌సి కెమిస్ట్రీ, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, బిఎస్‌సి బోటనీ, బిఎస్‌సి జువాలజీ ఉన్నట్లు చెప్పారు. తమ కాలేజీలో అతి పెద్ద క్రీడాస్థలం అందుబాటులో ఉండటంతో కళాశాలకు చెందిన విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో క్రీడల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఆధునిక కంప్యూటర్, లేబరేటరీ సౌకర్యం, వేల పుస్తకాలతో కళాశాల స్వంత లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 18న ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేస్తుందని, జూన్ 19 నుంచి 24వ తేదీ వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం కాలేజీలో ఉచితంగా సౌకర్యం కల్పించామని చెప్పారు. పూర్తి వివరాలకు అడ్మిషన్స్ కన్వీనర్ నంబరు 9143839999ను సంప్రదించాలని కోరారు.

నూకశాతం పేరుతో మోసం : ఆరిమిల్లి

ప్రజాశక్తి - తణుకు

నూకశాతం పేరుతో వైసిపి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. బుధవారం స్థానిక బివిఎస్ ప్యాలెస్‌లో నియోజవర్గ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నియోజవర్గంలో సుమారు లక్షల టన్నుల ధాన్యం సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. నూక శాతం పేరుతో ఒక్కో రైతు నుంచి ఏడు వేల నుంచి 15 వేల వరకూ కట్ చేస్తున్నారంటే ఈ ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ రైతు అధ్యక్షులు నల్ల భాస్కరరావు, నరసాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, దాసం బాబ్జి, గోపిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో బుధవారం టిడిపి నియెజకవర్గ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాబ్జి మాట్లాడారు. అకాల వర్షాల వల్ల రైతులు పంట నష్ట పోయారన్నారు. ధాన్యం రంగు మారిందని, తేమశాతం, నూకశాతం పేరుతో అధిక నష్టం కలిగించారన్నారు. ఆ నష్టపరిహారం వెంటనే ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఎంత మంది నష్టపోయారో అందరి వివరాలు సేకరించి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల అన్నవరం, దాసరి అప్పన్న, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, పాతూరి రాంప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డిపో నుంచి అరుణాచలం యాత్ర ప్రత్యేక బస్ సర్వీసు జులై 1వ తేదీ సాయంత్రం తాడేపల్లిగూడెం బస్ స్టేషన్ నుండి రాత్రి 7.00 గంటలకు బయలుదేరి యాత్ర పూర్తి చేసుకుని 4వ తేదీ తిరిగి వస్తుందని తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

అతిసార నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో ఐదేళ్లలోపు పిల్లలకు నీళ్ల విరేచనాలు అయితే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్లు పి.సంతోషనాయుడు, పి.కిరణ్మయి తెలిపారు. బుధవారం ఆసుపత్రి పరిధిలో సచివాలయం వద్ద ఆరోగ్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ వరకూ జరిగే అతిసార నియంత్రణా కార్యక్రమంలో భాగంగా సమావేశాలు నిర్వహించి, ప్రజలకు అతిసార నివారణపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నీళ్ల విరేచనాలు అయిన పిల్లలకు 15 రోజులపాటు ఓరస్‌తోపాటు జింకు మాత్రలు అందించి చికిత్స అందిస్తామని చెప్పారు. సిహెచ్ఒ జి.విల్సన్‌బాబు మాట్లాడుతూ తమ ఆసుపత్రి పరిధిలో 2091 మంది పిల్లలు ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంఎల్‌హెచ్ పి.దేవిక, ఎఎన్ఎం ఐ.జయమ్మ, హెల్త్ అసిస్టెంట్లు జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముమ్మరంగా తాడేరు వంతెన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తాడేరు వంతెన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.రెండు కోట్ల 30 లక్షల నిధులతో వంతెన నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. 1929లో నిర్మాణం జరిగిన ఈ వంతెన స్థానంలో తన హయాంలో నూతన వంతెన నిర్మాణానికి నోచుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాజకీయాల్లో ప్రజలకు సేవ చేస్తేనే సంతోషం ఉంటుందన్నారు. అంతేగాని పదవులను అలంకారంగా చేసుకోవడం వల్ల ప్రజలకు మేలు జరగదన్నారు.

సచివాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వడ్లవానిపాలెం గ్రామంలో నూతన సచివాలయ నిర్మాణానికి ఎంఎల్ఎ కౌరు శ్రీనివాస్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలని, ప్రతి గ్రామమూ అభివృద్ధి చెందాలని, గ్రామాల అభివృద్ధే జగన్ ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. రూ.20 లక్షలు జెడ్‌పి సాధారణ నిధుల నుండి మంజూరు చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పెన్మత్స పద్మ, పెన్మత్స ఏసు రాజు, డిటిడిసి బాబు, సాయి రాజు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం ఇవ్వాలి

ప్రజాశక్తి - పెనుగొండ

ప్రతి కౌలు రైతుకూ పంట సాగు హక్కు పత్రం ఇవ్వాలని కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. బుధవారం ములపర్రు రైతు భరోసా కేంద్రం అధికారి కుడిపూడి సంధ్యకు కౌలు రైతులు సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం మండల నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులు వ్యవసాయం భారమైనా వేరే వృత్తుల్లోకి వెళ్లలేక పాడి గేదెలకు, పశువులకు కాస్త గడ్డి అయినా దొరుకుతుందనే ఆశతో కౌలు వ్యవసాయంలోనే ఉండిపోయారన్నారు అప్పులు పెరగడం. ప్రభుత్వాల నుండి భరోసా లభించక కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో మన రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. వారికి పంట సాగు హక్కు పత్రం ఇవ్వాలని, ఇప్పుడు ఉన్న కౌలు చట్టాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు గుబ్బల నాగార్జున, పంది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.